# జేఎన్‌టీయూ బీటెక్ స్పాట్ అడ్మిషన్స్ - 2026

నవతెలంగాణ-సిటీబ్యూరో

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూహెచ్, రాయిట్లింగెన్ యూనివర్సిటీ నాలెడ్జ్ ఫౌండేషన్ – జర్మనీ సంయుక్తంగా 2026 విద్యా సంవత్సరానికి ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాయి. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు మొదటి మూడేండ్లు జేఎన్‌టీయూహెచ్‌లో, అనంతరం రెండేండ్లు జర్మనీలోని రాయిట్లింగెన్ యూనివర్సిటీలో చదువుతారు. కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులకు జేఎన్‌టీయూహెచ్ నుంచి బీటెక్ (సీఎస్ఈ) డిగ్రీతోపాటు రాయిట్లింగెన్ యూనివర్సిటీ, జర్మనీ నుంచి ఎంఎస్సీ ప్రొఫెషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ డిగ్రీ ప్రదానం చేస్తారు. ఇందులో ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్ అండ్ మాస్టర్స్ ప్రోగ్రాం (బీటెక్ సీఎస్ఈ ప్లస్ ఎంఎస్ ప్రొఫెషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్)-60 సీట్లు, బీటెక్ ఈసీఈ- 60 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు వ్యవధి ఐదేండ్లు, (10 సెమిస్టర్లు) ఉంటుంది. ఇందుకు అర్హతగా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్మీడియట్ ఎంపీసీ లేదా సమాన కోర్సు ఉత్తీర్ణత. ఇంగ్లీష్ మీడియంలో చదవని అభ్యర్థులు ఐఈఎల్‌టీఎస్/టీఓఈఎఫ్ఎల్ స్కోరు సమర్పించాలి. జేఈఈ మెయిన్ స్కోరు లేదా తెలంగాణ ఎప్‌సెట్ ర్యాంకు ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. చివరి తేదీ ఈ నెల 12 వరకు





పొడిగించగా.. ఆలస్య రుసుంతో ఈ నెల 14వ తేదీ వరకు ఉంది. కౌన్సెలింగ్ ఈ నెల 15వ తేదీన జేఎన్‌టీయూహెచ్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్ లో నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు https://doa.jntuh.ac.in/ను సంప్రదించాల్సి ఉంటుంది. హెల్ప్‌డెస్క్ కోసం 9044115999, 9044117999 ఫోన్ నెంబర్లను సంప్రదించాల్సి ఉంటుంది.

# రెండో దశ కౌన్సెలింగ్‌పై ఆశలు

**టాపర్లంతా డీమ్డ్ వైపు..**
**రిపోర్టింగ్‌కు విముఖత**

- కంప్యూటర్ కోర్సులపై 25 వేల ర్యాంకు లోపు విద్యార్థుల ఆసక్తి
- సీటు వస్తుందనే నమ్మకంతో రిపోర్టుకు దూరంగా ఉండే యోచన
- రెండో దశలోపే యాజమాన్య సీట్ల భర్తీ
- ప్రైవేటు కాలేజీల వ్యూహ రచన



సాక్షి, హైదరాబాద్: తొలి విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌తో నిరాశ కలిగిన విద్యార్థులు రెండో విడతపై ఆశలు పెట్టుకుంటున్నారు. వచ్చేవారం మొదలయ్యే మరో విడత కౌన్సెలింగ్‌కు సన్నద్ధమవుతున్నారు. సీట్లు వచ్చినా ఇష్టం లేని బ్రాంచీ, కాలేజీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. మంచి కాలేజీ, బ్రాంచీలో సీట్లు వచ్చిన విద్యార్థులు మాత్రం ఆమోదం తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. మొదటి దశలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. ఇది చేయని పక్షంలో కేటాయించిన సీటు రద్దవుతుంది. అయినప్పటికీ రెండో విడత కౌన్సెలింగ్‌కు వెళ్లే అర్హత ఉంటుంది.

**వాళ్ల ఆప్షన్లే కీలకం**

రాష్ట్రవ్యాప్తంగా 88,053 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, తొలి దశలో 79,891 సీట్లు కేటాయించారు. ఇంకా 8,162 సీట్లు మిగిలిపోయాయి. సీట్లు పొందిన వారిలో 10 వేల లోపు ర్యాంకు ఉన్నవాళ్లు 6,616 మంది మాత్రమే ఉన్నారు. 10 నుంచి 25 వేల ర్యాంకు వచ్చిన విద్యార్థులు 11,458 మంది ఉన్నారు. రెండో దశ కౌన్సెలింగ్‌లో 1–10 వేల లోపు ర్యాంకర్లు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేది తక్కువగానే ఉంటారు. వీళ్లంతా జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలు లేదా ఐఐటీల్లోకి వెళ్లే అవకాశం ఉంది. ఇది కాకపోతే ప్రైవేటు డీమ్డ్ కాలేజీలు తక్కువ ఫీజుతో వీరికి సీట్లు ఇచ్చే వీలుంది. దీంతో 20 వేలపైన ర్యాంకు ఉండే విద్యార్థులు రెండో దశలో ఇంకాస్త ముందుకు జరిగే అవకాశం ఉంటుంది. అలాగే, 75 వేల నుంచి లక్ష ర్యాంకు వచ్చిన విద్యార్థుల్లో 11,753 మందికి తొలి దశలో సీట్లు వచ్చాయి. వీరిలో చాలామందికి సివిల్, మెకానికల్ వంటి బ్రాంచీల్లో సీట్లు వచ్చాయి. పెద్దగా పేరున్న కాలేజీలు కూడా కావు. దీంతో వీరిలో 40 శాతం మంది విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లకు ప్రయత్నిస్తారు. లక్షపైన ర్యాంకున్న విద్యార్థులకు తొలి దశలో 18,763 సీట్లు కేటాయించారు. వీరిలో కూడా కొంతమంది మెరుగైన బ్రాంచీల కోసం ఎదురు చూస్తున్నారు. కాబట్టి ప్రతీ విద్యార్థి చూపంతా రెండో విడత కౌన్సెలింగ్‌పై ఉంది.

**మేనేజ్‌మెంట్ వల**

విద్యార్థులు ఎప్పటిలాగే ఈసారి కూడా కంప్యూటర్ సైన్స్, ఎమర్జింగ్ కోర్సులనే ఎంచుకున్నారు. ఈ బ్రాంచీల్లో 62,509 సీట్లు ఉన్నాయి. వీటిలో 58,376 సీట్లు భర్తీ అయ్యాయి. ఇక మిగిలిన సీట్లు 4,133 మాత్రమే. ఇవి కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సీట్లు. మేనేజ్‌మెంట్ సీట్లు 35 వేలకుపైగా ఉంటాయి. వీటిని భర్తీ చేసుకునేందుకు ప్రైవేటు యాజమాన్యాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. సీఎస్ఈ, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్ వంటి సీట్లకు భారీగా గిరాకీ ఉండటంతో ఈ సీట్లకు పెద్దఎత్తున డొనేషన్లు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. తొలి కౌన్సెలింగ్‌లో సీటు రాని వారిని గుర్తించి, మేనేజ్‌మెంట్ సీట్లలోకి తీసుకునేందుకు ఏజెన్సీలు, పీఆర్‌వోలు చురుగ్గా పనిచేస్తున్నారు. 25 వేల పైన ర్యాంకు వచ్చిన విద్యార్థులు ఎమర్జింగ్, కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరేందుకు తేలిగ్గా ఒప్పుకుంటారనేది మేనేజ్‌మెంట్ల ఆలోచన. లక్షకుపైగా ర్యాంకు ఉన్న విద్యార్థులు సివిల్, మెకానికల్‌తోపాటు ఈసీఈ, ఈఈఈ వంటి కోర్సుల్లో తక్కువ డొనేషన్‌తో చేర్చుకునేందుకు యాజమాన్యాలు ఆసక్తి చూపుతున్నాయి. మేనేజ్‌మెంట్ కోటా సీట్ల విక్రయాలను త్వరగా ముగించేందుకు ప్రైవేటు యాజమాన్యాలూ తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయి. రెండో దశ కౌన్సెలింగ్‌లోపే ఈ సీట్ల భర్తీ చేస్తే ఆశించిన మేర డిమాండ్ చేయొచ్చని భావిస్తున్నాయి.